క్లుప్తంగా

కల్యాణోత్సవాలు ప్రారంభం



మండవల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం మల్లేశ్వరస్వామిని పెండ్లి కుమారుడిగా, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అనంతరం అభిషేకాలు, సమస్రనామార్చనలు నిర్వహించారు. కలశ స్థాపన, అఖండ స్థాపన, బలిహరణ, మంత్రపుష్ప నీరాజనాలు, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మ్యాథ్స్ - బీ ఫైనల్స్‌కు గౌతమ్ విద్యార్థులు



గుడివాడటౌన్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జనవరి 22న విజయవాడలో నిర్వహించిన మ్యాథ్స్–బీ సెకండ్ లెవల్ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ఫైనల్ పోటీకి అర్హత సాధించారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సత్యారామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటగిరి – 1 లో పి.మానస్వి, కేటగిరి – 3 లో ఇ.కార్తికేయ, ఎం.నీరజ్‌కుమార్, బి.గురుదీప్‌రెడ్డి, కేటగిరి – 4 లో వీవీ కౌశిక్‌రెడ్డి, పి.నవదీప్‌లు ఫైనల్‌కు చేరుకున్నారన్నారు. ఈనెల 28న హైదరాబాద్‌లో జరిగే ఫైనల్ లెవల్ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారని, ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జ్యోతి, జబ్రీనా తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్నార్ కళాశాల నూతన పాలకవర్గం ఎంపిక



గుడివాడటౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల నూతన పాలకవర్గం ఎంపిక శనివారం కళాశాలలో ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కె.రామకృష్ణయ్య వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఎల్.రామకృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడు పి రాజభూషణరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, కోశాధికారి పి.కృష్ణ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు బీఆర్ కుటుంబరావు, కె.రమణకుమార్, సభ్యులు ఉపద్రష్ట రామస్వామిశాస్త్రి, కె.శాంతారామ్, ఎ.ఆదినారాయణ, వై.అంకయ్య చౌదరి, కె.సుబ్బారావు, వి.రంగారావు, ఎస్.రమణబాబు, కె.శ్రీనివాసరావు, వి.చంద్రమోహన్ ఎంపికయ్యారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

మండవల్లి: మండవల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్)లో రుణం తీసుకున్న చెన్నంశెట్టి శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సొసైటీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, సొసైటీ సిబ్బంది శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు.

విద్యార్థుల మాక్ పార్లమెంట్



పెడన: నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో విజయవాడ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. మాక్ పార్లమెంట్‌లో భాగంగా విద్యార్థులు మంత్రులుగా, సభ్యులుగా ఉంటూ స్పీకర్, డెప్యూటీ స్పీకర్లుగా బడ్జెట్ కేటాయింపులు, వాటిని ఏవిధంగా వెచ్చించనున్నది, కేటాయింపులు సక్రమంగా చేస్తున్నా సరిగ్గా వెచ్చించని వైనంపై ప్రశ్నించడం తదితర వాటిపై విద్యార్థులు ఆయా పాత్రలను పోషించారు. సరైన సమాధానాలు ఇవ్వడం, ప్రశ్నించడం చేసిన విద్యార్థినీ విద్యార్థులు 10 మందిని ఎంపిక చేసి వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పెడన మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, కళాశాల కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, జిల్లా ట్రైబల్ అధికారి ఫణి ధూర్జటి తదితరులు పాల్గొన్నారు.

వదలని అకాల వర్షాలు



గుడివాడ మార్కెట్ సెంటర్‌లో నిలిచిన వర్షం నీరు

గుడ్లవల్లేరు/గుడివాడటౌన్: అకాల వర్షాలు వదలడం లేదు. భారీ వర్షాలకు గాలి గుట్టలు, పనల మీదున్న మినుము పంట తడిసింది. దీనితో మినుము మొలక వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.80 వేల వరకూ నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. వాముల మీదున్న మినుము పరదాలు కప్పుకుని పంటను వర్షం బారిన పడకుండా కాపాడుకునేందుకు రైతులు చర్యలు తీసుకుంటున్నారు. గుడివాడ పట్టణంలో శనివారం భారీ వర్షం కురిసింది. రెండు పర్యాయాలు కురిసిన వర్షంతో రోడ్లపై నీరు నిలిచాయి. దీంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులపాలు కాగా స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు.

ముదినేపల్లి రూరల్/మండవల్లి: మినుము పైరు తీతలు, నూర్పిడ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వచ్చిన ఈ వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. శనివారం ఉదయం నుంచి విడువకుండా కురుస్తున్న వర్షం వల్ల ఎలాంటి పనులు చేపట్టేందుకు రైతులకు అవకాశం లేకుండా పోయింది. దీంతో పనలపై ఉన్న పలు గ్రామాల్లో పూర్తిగా తడిసిపోయింది. గుట్టలుగా ఉన్న పైరు సైతం బూజుపట్టి గింజ దెబ్బతినే ప్రమాదముందనే భయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు రైతులను మరింత భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వర్షానికి దెబ్బతిన్న పైర్లను స్థానిక వ్యవసాయ సహాయకులు(వీఏఏలు) క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పైరు తీతలు ముమ్మరంగా సాగుతున్న సింగరాయపాలెం, పెదపాలపర్రు, చినపాలపర్రు, కోడూరు, పెయ్యేరు, వణుదుర్రు, వాడవల్లి తదితర గ్రామాల్లోని పైరుకు ఎక్కువ నష్టం కలిగింది. మండవల్లి మండలంలో 3 వేల ఎకరాల్లో మినుము పైరును రైతులు సాగు చేశారు. ఇంకా వర్షం కురిస్తే మినుము రైతులకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

పామర్రు: అకాల వర్షాలతో గ్రామంలోని చిన్న పాల కేంద్రం వద్ద, గఫార్ సెంటర్, అరండల్‌పేటల్లో రహదారులు నీటిమయంగా మారాయి. పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. మినుము పంట తీవ్రంగా దెబ్బతింది.



గుడ్లవల్లేరులో మినుము పంటను కాపాడుకుంటున్న రైతు



పెయ్యేరులో తడిసిన మినుము పైరును చూపుతున్న రైతు



కైకలూరులో నిలిచిన వర్షం నీరు

సీహెచ్‌సీలో శాశ్వత అన్నదానం ప్రారంభం



అన్నదానం నిర్వహిస్తోన్న సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

కైకలూరు: భగవాన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో పలు ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత అన్నదాన సేవలను నిర్వహిస్తున్నామని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కె.శశిశేఖరరావు చెప్పారు. కైకలూరు సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో శాశ్వత అన్నదాన కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు, తణుకు, భీమవరం, నిడదవోలు వంటి ఆస్పత్రులలో సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత భోజనాన్ని అందిస్తోన్నామన్నారు. కైకలూరు సేవా సంస్థ కన్వీనర్ వీరప్ప, సత్యసాయి భక్తులు డీవీడీ.కృష్ణమోహన్, దుర్గాప్రసాద్, సాయి కృష్ణ, వరలక్ష్మి, అనూరాధ, విజయలక్ష్మి, మన్నెం చలపతి, యర్రంశెట్టి విజయసారథి పాల్గొన్నారు.

పాఠశాలల్లో నో బ్యాగ్ డే



వడాలి జెడ్పీ హైస్కూల్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ముదినేపల్లిరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్‌డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులు పాఠశాలల్లో ఆటపాటలు, చిత్రలేఖనం ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఇందులో భాగంగానే విద్యార్థులు పుస్తకాలను పక్కన పెట్టి పలు పాఠశాలల్లో ఆటపాటల్లో మునిగి తేలడంతో పాటు చిత్రలేఖనంతో పాటు నీతి కథలు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వడాలి జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు బీఎస్ నాగమల్లేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



రాపర్లలో కిట్‌లను అందజేస్తున్న జెడ్పీటీసీ స్వరూపరాణి తదితరులు

రాపర్ల(పామర్రు): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పామర్రు జెడ్పీటీసీ కె.స్వరూపరాణి తెలిపారు. మండల పరిధి రాపర్ల సచివాలయ వద్ద సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన పథకాలను వాటి వలన పొందుతున్న లబ్ధిని ప్రజలకు తెలపాలన్నారు. జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలుపర్చి ప్రజా రంజక పాలన అందిస్తున్నామని చెప్పారు. నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నాడు – నేడు, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలందరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపే విధంగా వారికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, జమీదగ్గుమిల్లి సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రావు, పోలవరం సర్పంచ్ శ్రీలక్ష్మి, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, దామోదరం రెడ్డిబాబు, రాంబాబు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినిని ప్రశ్నిస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా

పామర్రు(పమిడిముక్కల): పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా ఆదేశించారు. పమిడిముక్కల మండలం తాడంకి జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. విద్యార్థులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పరీక్షలకు సిద్ధం కావాలని చెప్పారు. పాఠశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా పాఠ్య పుస్తకాలను చదవాలని సూచించారు. పరీక్షలంటే భయంలేకుండా ప్రశాంతమైన మనస్సుతో పరీక్షలకు హాజరు కావాలని అప్పుడే మంచి మార్కులు సాధిస్తారని చెప్పారు. పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని, ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన ఫలితాలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం శారదా కాంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి



వైఎస్సార్ ఆసరా మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఏపీఎం కృష్ణంరాజు, సర్పంచ్ ప్రభుదాస్

తోట్లవల్లూరు: వైఎస్సార్ ఆసరా పథకంతో డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని డీఆర్డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ జి.కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని రొయ్యూరులో వైఎస్సార్ ఆసరా మూడో విడత విడుదలపై ఆయన శనివారం డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు మూడు దశల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 25న వైఎస్సార్ ఆసరా నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేస్తారని ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా 810 స్వయం సహాయక సంఘాలకు రూ.8.13 కోట్లు విడుదలవుతాయన్నారు. వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా మహిళలకు ఎంతో మేలు కలుగుతోందన్నారు. సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, క్లస్టర్ కో ఆర్డినేటర్ నాగమల్లేశ్వరి, వీఓఏ పూజిత, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శ్రీకారం



విద్యుత్ స్తంభం తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

గుడివాడటౌన్: గుడివాడ పట్టణ ప్రజల చిరకాల వాంఛ రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) విజ్ఞప్తి మేరకు బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి చొరవతో రూ.320 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి గతేడాది శంకుస్థాపన జరిగింది. నిర్మాణానికి మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖల నుంచి సహకారం అవసరం కాగా మున్సిపల్ అధికారులు రోడ్డుపై గల డివైడర్లు తొలగించే పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలుత రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ లైట్ల స్తంభాలను తొలగించారు. ఇప్పటికే భూ సేకరణకు అవసరమైన సొమ్మును చెల్లించడం పూర్తికావడంతో త్వరలోనే రోడ్డు మార్జిన్ ఖాళీ చేయించే పనులను రెవెన్యూ అధికారులు చేపట్టనున్నారు. ఈ రెండు పనులు పూర్తయిన వెంటనే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ముమ్మరంగా సర్వే రాళ్లు ఏర్పాటు



జమీగొల్వేపల్లిలో సర్వే రాళ్లు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

పామర్రు: రీ సర్వే పనులు పూర్తి అయిన గ్రామాల్లో ముమ్మరంగా సర్వే రాళ్లను ఏర్పాటు చేయిస్తున్నట్లు పామర్రు తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి తెలిపారు. మండల పరిధి జమీగొల్వేపల్లి గ్రామంలో శనివారం రీ సర్వే రాళ్లు ఏర్పాటు చేయించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 120 ఏళ్ల నాటి సర్వే రికార్డులు ఆధారంగానే ఇప్పటికీ భూ సర్వే చేపడుతున్నామని, ఎన్నో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని గ్రహించిన ప్రభుత్వం సమగ్ర భూ సర్వేలను నిర్వహిస్తోందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఈ సమగ్ర భూముల సర్వే చేపడుతున్నామని చెప్పారు. 100 శాతం కచ్చితత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. భూముల రీ సర్వే కోసం అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోందని తెలిపారు.

త్వరితగతిన సర్వే పూర్తి చేయాలి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్ విభాగాల అధికారులు సర్వే సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఆధునిక సర్వే యంత్రాలతో సర్వే పూర్తి చేశామని తహసీల్దార్ చెప్పారు. ప్రతి గ్రామానికి ఇద్దరు సర్వేయర్లు, వీఆర్వోతో బృందం ఏర్పాటు చేసి సర్వేలు నిర్వహించామన్నారు. ఈ సర్వే సజావుగా సాగేందుకు తొలుత భూ రికార్డుల స్వచ్ఛీకరణ వీఆర్వో బృందంతో చేపట్టామన్నారు. డీజీపీఎస్, ఈటీఎస్, డ్రోన్ సర్వే ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలుత రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను ప్రక్షాళన చేసి, దాని ప్రకారం సర్వే నిర్వహించి రైతుల భూముల సరిహద్దులను నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ నంబరు వస్తుందన్నారు. అలాగే 14 అంకెలతో కూడిన గుర్తింపు కార్డును భూమికి కేటాయిస్తామని చెప్పారు. మండల పరిధిలో రీ సర్వే పనులు పూర్తి అయిన 9 గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన సర్వేరాళ్లను పాతిస్తున్నామన్నారు. మండల పరిధిలో ఇంకా రీ సర్వే పనులు పూర్తి కాని పామర్రు, పెదమద్దాలి, పసుమర్రు, కురుమద్దాలి గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. ప్రతి రైతుకు తమ భూములకు సంబంధించి సరిహద్దు రాళ్లు ఉంటాయని, ఈ రాళ్లను ప్రభుత్వం రైతులకు ఉచితంగా వేయిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రదీప్, సచివాలయ సర్వేయర్ రామ్మోహన్, గ్రామ సర్పంచ్ శాంతకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత

ఘంటసాల(అవనిగడ్డ): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా ఆదాయంతో పాటు ఆరోగ్యం పెరుగుతుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీలత అన్నారు. స్థానిక కేవీకేలో శనివారం చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీలత మాట్లాడుతూ చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువలు మరే పదార్థాల్లోనూ ఉండవన్నారు. వీటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు సాగుచేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని చెప్పారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. వెంకటలక్ష్మీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విత్తన శుద్ధి, పోషక యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ చర్యలను రైతులకు తెలిపారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ చిరుధాన్యాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ చిరు ధాన్యాల ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కె. రేవతి, డాక్టర్ వి. నవీన్‌కుమార్, కృష్ణవేణి, రైతులు, యువకులు పాల్గొన్నారు.

పోలీసులపై వీరంగం సరికాదు

గుడివాడటౌన్: అనుమతులు లేకుండా చట్ట విరుద్ధ కార్యక్రమాలు చేపట్టిన వారిని నియంత్రించడానికి ప్రయత్నించిన పోలీసు అధికారులను బెదిరించడం, హెచ్చరించడం సరికాదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం కృష్ణాజిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలు గెలుచుకున్న టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసేందుకు రావి వెంకటేశ్వరావుకు సీట్ ఇస్తారా లేదా అనే అంశంపై ముందు స్పష్టత తెచ్చుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా ఈ విధానాన్ని మార్చుకోకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంపటి సైమన్, సుధాకర్, చుండూరి శేఖర్ పాల్గొన్నారు.

22న కళాపీఠం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు

పామర్రు: శ్రీ శోభకృత నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీన ఉగాది పురస్కారాలను అందిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల – బాలు స్మారక సంగీత కళాపీఠం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కోటి పాండురంగారావు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం 9గంటలకు స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో లంక భీష్మకుమార్‌చే పంచాంగ శ్రవణం, అనంతరం ఐదుగురు బ్రాహ్మణులకు సత్కారం చేస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వివిధ రంగాల్లో ప్రముఖులైన ఏడుగురికి ఉగాది పురస్కారాలను అందజేస్తామని చెప్పారు. తదుపరి గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్, భారత వికాస్ పరిషత్ వారి ఆధ్వర్యంలో ఘంటసాల కళాపీఠం అధ్యక్షులైన కాటూరు వెంకట మురళీకృష్ణకు 'పామర్రు ఘంటసాల' అనే బిరుదును ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమాల్లో కళాపీఠం సభ్యులు, కళాభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

65 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 65 మందికి గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలను చేశారు. అవసరమైన వారికి కంటి శస్త్రచికిత్స నిమిత్తం సిఫార్సు చేశారు. సుగర్, బీపీ పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందించామని లయన్స్ అధ్యక్షుడు శింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

గుడివాడటౌన్: ఈ నెల 30వ తేదీన భద్రాచలంలో జరగనున్న భద్రాద్రి సీతారాముల కల్యాణానికి గుడివాడ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 ఉదయం, సాయంత్రం ఈ బస్సులు బయలుదేరతాయన్నారు. బస్సులో టికెట్‌లకు రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. టికెట్‌లను ఆన్‌లైన్ ద్వారా, రిజర్వేషన్ కౌంటర్ నుంచి, ఏటీబీ ఏజెంట్ల ద్వారా పొందవచ్చునన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ

గుడివాడటౌన్: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, చైల్డ్ ఫండ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఏఆర్టీ మందులు వాడుతున్న వారికి పౌష్టికాహారాన్ని శనివారం పంపిణీ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పేషెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారికి మందులు, న్యూట్రీషియన్ ఫుడ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. వారిని ఆదరించడం సమాజ బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా డీఆర్పీ ఎల్ సురేష్‌కుమార్, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, లింక్ వర్కర్‌లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి, దేవి, మంగతాయారు పాల్గొన్నారు.